# ఖాజీపల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు






గురువారం 23 జూలై 2026 పేజీలు : 8

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించం

## చలో లోక్ భవన్'లో కేంద్రంపై మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర విమర్శలు





**అందోల్, (ప్రజాజ్యోతి):** నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశ రాజకీయాల్లో మరోసారి వేడిని రాజేసింది. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "చలో లోక్ భవన్" కార్యక్రమంలో తెలంగాణ వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఏళ్ల తరబడి కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటే, పేపర్ లీకుల వంటి ఘటనలు వారి ఆశలను దెబ్బతీస్తున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. "మా శ్రమకు విలువ లేదా?" అనే విద్యార్థుల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ సమాధానం చెప్పలేకపోయిందని విమర్శించారు.
సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న విద్యార్థుల గొంతు అణచివేయడానికి పోలీసులను

- మిగతా 3లో

# ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రం కుట్ర...

రాహుల్ గాంధీని చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోంది..
-లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ చెలగాటం..
నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి..
నీలం మధు ముదిరాజ్



# లోక్ సభా ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ అక్రమ అరెస్టు అప్రజాస్వామికం

మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్

శాంతియుత నిరసన ధర్నా లో హోరెత్తిన జహీరాబాద్ కాంగ్రెస్



# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా ఖేడ్‌లో ధర్నా





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 22:** ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇతర ముఖ్య నేతల అరెస్టును నిరసిస్తూ నారాయణఖేడ్ పట్టణంలోని ఇంద్ర చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యుడు సురేష్ కుమార్ షెట్కార్ ఆదేశాల మేరకు నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య గొంతుకను అణిచివేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన నీట్ పేపర్ లీకేజీ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కంగ్టిలో బేటి బచావో--బేటి పడావో అవగాహన కార్యక్రమం







**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 22:** మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కంగ్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు మండల కేంద్రంలోని నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో బేటి బచావో--బేటి పడావో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ నారాయణఖేడ్ ప్రాజెక్టు సీడీపీఓ ఎన్. సుజాత మాట్లాడుతూ..బాలికల విద్య, భద్రత, హక్కులు, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రతి బాలిక విద్యను అభ్యసించి స్వయం సమృద్ధి సాధించేలా సమాజం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త గడ్డం పల్లవి మాట్లాడుతూ.. బాలికలు విద్యతో పాటు ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మవిశ్వాసం, స్వీయ రక్షణ అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం బాలికల సాధికారత, విద్య, భద్రతపై ప్రతిజ్ఞ చేయించి అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎండి రహిమొ ద్దీన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి, పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు శైలజ కులకర్ణి, ఏఎస్ఐ రవీందర్ గౌడ్, షీ టీమ్ ఏఎస్ఐ తులసిరాం, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 22:** శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన ఇసారపు శోభన్ గౌడ్‌కు ఆవుల రాజిరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన రూ. 32,000 విలువైన చెక్కును బుధవారం నాడు నవీన్ గుప్తా చేతుల మీదుగా అందజేశారు. అలాగే పిల్లుట్ల గ్రామానికి చెందిన గంట్యాల నరసింహారెడ్డికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి,నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి సహకారంతో మంజూరైన రూ. 55,000 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును గ్రామ సర్పంచ్ బుర్ర మురళి గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వారాల గణేష్,గడ్డమీద కృష్ణ గౌడ్,పిలుట్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాఘవరెడ్డి,ఉప సర్పంచ్ గొల్ల స్వామి, ఆంజనేయులు, శంకర్,గ్రామ కార్యదర్శి నాగేష్,దొంతి ఉప సర్పంచ్ శ్రీనివాస్,ఇసారపు రాజు గౌడ్,పెద్దపుల్లి సతీష్,అరుణ్, కిషన్,వంజరి నాగభూషణం,పిల్లి మధు,బబ్బురి వెంకటేష్,కమ్మరి సురేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## శ్రీ సాయి సంజీవని ఆసుపత్రిలో వాస్కులర్ సర్జరీ ఓపీడీ సేవలు



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 22:** నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీ సాయి సంజీవని ఆసుపత్రిలో వాస్కులర్ సర్జరీ ఓపీడీ సేవలు అందుబాటులో ఉంటాయని ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ జగన్ మోహన్, డాక్టర్ సుష్మ తెలిపారు. వారు ఒక ప్రకటనలో పేర్కొంటూ.. వాస్కులర్ సర్జరీ నిపుణులు డాక్టర్ కె. అతిరేధ్ ఆగస్టు 4న ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేరికోజ్ వెయిన్స్‌కు లేజర్ మరియు గ్లూ థెరపీ, డీప్ వెయిన్ థ్రాంబోసిస్ (డి.వి.టి), గ్యాంగ్రీన్ ఫుట్, డయాలసిస్ కోసం ఏవీ ఫిస్టులా (ఏ.వి ఫిస్టుల), పెరిఫెరల్ ఆర్టరీ వ్యాధులు తదితర సమస్యలకు ప్రత్యేక వైద్య సేవలు, చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలు మరియు ముందస్తు అపాయింట్‌మెంట్ కోసం 76619 99947, 88861 30320 నంబర్లను సంప్రదించాలని కోరారు.

# సంగారెడ్డిలో రాహుల్ గాంధీ అరెస్టుకు
# నిరసనగా కాంగ్రెస్ మహా ధర్నా





కల్హే ర్. 23.జూలై. ప్రజా జ్యోతి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో కల్హేర్ మండలానికి చెందిన సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కల్హేర్ సర్పంచ్ కోడి గంగారాం, కల్హేర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. శ్రీనివాస్ గౌడ్, మండల ఎమాజీ అధ్యక్షుడు బి. పోచయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవదాస్,. పి వెంకటరెడ్డి, వై.ఎన్. రవీందర్ రెడ్డి, మలిదొడ్డి తుకారాం, నాగ్దర్ పోచయ్య, యువ నాయకులు, మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని వారు తెలిపారు.

# "విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే సహించం"

-మొదటిపేజీ తరువాయి

వినియోగిస్తోందని ఆరోపించారు. నీట్ వ్యవహారంపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో పాటు ఇతర నాయకులను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మంత్రి అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే స్వరాలను బలప్రయోగంతో అణచివేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు.

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే: దామోదర్**

నీట్ కుంభకోణానికి పూర్తి నైతిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్న మంత్రి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకుండా, న్యాయం కోరుతున్న విద్యార్థులను అణచివే యడం దేశ ప్రజాస్వామ్యానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.

**సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు కోరిన మంత్రి**

నీట్ పేపర్ లీక్‌తో పాటు దేశవ్యాప్తంగా జరిగిన పోటీ పరీక్షల అక్రమాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సమగ్ర దర్యాప్తు జరిపించాలని దామోదర్ రాజనర్సింహ డిమాండ్ చేశారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు సాంకేతిక, పరిపాలనా సంస్కరణలు చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**రాజకీయంగా ముదురుతున్న వివాదం**

నీట్ పేపర్ లీక్ అంశాన్ని కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమంగా మలుస్తుండగా, కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోంది. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల విశ్వసనీయత, బాధ్యులపై చర్యల అంశాలు ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకునే తదుపరి నిర్ణయాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

## మునగ పంటలో సమగ్ర పోషక యాజమాన్యంపై రైతులకు అవగాహన



**రాయికోడ్ జూలై 22 (ప్రజా జ్యోతి):** మండలంలోని నల్లంపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మునగ పంటలో సమగ్ర పోషక యాజమాన్య (ఐ ఎన్ ఎం) అంశంపై క్షేత్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సారిక (ఎంఎఓ),వ్యవసాయ సాంకేతిక నిర్వాహకుడు (ఎటిఎం) శ్రీ రమేష్,వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) శ్రీ నిఖిలేష్ పాల్గొని రైతులకు మునగ పంటలో శాస్త్రీయ సాగు విధానాలు,సమతుల్య పోషక నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మునగ పంటలో అధిక దిగుబడులు,నాణ్యమైన ఉత్పత్తి సాధించాలంటే సేంద్రియ ఎరువులు,రసాయన ఎరువులు,సూక్ష్మ పోషకాలను సమతుల్యంగా వినియోగించడం అవసరమన్నారు.నేల పరీక్ష ఆధారంగా ఎరువులు వేయడం ద్వారా ఎరువుల ఖర్చు తగ్గడంతో పాటు నేల సారవంతత పెరిగి మొక్కల ఎదుగుదల మెరుగుపడుతుందని వివరించారు.పశువుల ఎరువు,వర్మీ కంపోస్ట్, వేపపిండి వంటి సేంద్రియ ఎరువులతో పాటు నత్రజని (ఎన్),భాస్వరం (పి),పొటాష్ (కే),సూక్ష్మ పోషకాలను సరైన మోతాదులో దశలవారీగా అందిస్తే పుష్పాలు,కాయల ఏర్పాటు మెరుగై అధిక దిగుబడి సాధించవచ్చని రైతులకు సూచించారు. అదేవిధంగా మట్టి తేమ సంరక్షణ,కలుపు నియంత్రణ,సకాలంలో నీటి యాజమాన్యం,తెగుళ్లు--పురుగుల సమగ్ర యాజమాన్య (ఐపీఎం) పద్ధతులను పాటించడం ద్వారా మునగ సాగును మరింత లాభదాయకంగా మార్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లంపల్లి గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని మునగ పంటలో సమగ్ర పోషక యాజమాన్యంపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## ఉత్సాహంగా గణిత బోధన శిక్షణ.. ఎం ఈ ఓ బి సురేష్




**కల్హేర్, జూలై 22:. ప్రజా జ్యోతి.** సంగారెడ్డి జిల్లాలోని మండల కేంద్రమైన కల్హేర్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమం బుధవారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గణిత శాస్త్రంపై రిసోర్స్ పర్సన్ భరత్ ప్రత్యేక శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని తొలగించి, సులభమైన బోధనా పద్ధతుల ద్వారా లెక్కలను ఆసక్తికరంగా నేర్పించే విధానాలను ప్రత్యక్ష బోధనతో వివరించారు. మారుతున్న విద్యా విధానాలకు అనుగుణంగా ఆధునిక బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు తమ తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం యు బి సురేష్ సహచర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## ఏఐఎఫ్‌బీ పార్టీలో చేరికలు...



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 22: ఏఐఎఫ్‌బీ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో ఎస్. చిరంజీవి ఆధ్వర్యంలో సుమారు 60 మంది చేరినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోజి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బి. రాములు యాదవ్ తెలిపారు. బుధవారం నారాయణఖేడ్ పట్టణంలో నిర్వహించిన ఏఐఎఫ్‌బీ జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి హాజరైన రాష్ట్ర నాయకులు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జోజి రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణలో ఏఐఎఫ్‌బీ పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలు, విధానాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బి. రాములు యాదవ్ మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీక్ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎస్. చిరంజీవిని ఏఐఎఫ్‌బీ జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ పార్టీ నాయకత్వం బాధ్యతలు అప్పగించారు.

ఈ కార్యక్రమంలో లక్ష్మణ్, మోచప్ప, గణేష్ సోయల్, శోభ, పండరి తదితర రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ జలసిరి పథకం ద్వారా భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం

## రైతులకు నీటి భద్రతే లక్ష్యంగా నీటి సంరక్షణ పనులు -- ఎంపీడీవో హరినందన్ రావు.

**కల్హేర్, జూలై 22 (ప్రజా జ్యోతి):** భూగర్భ జలాల సంరక్షణతో పాటు రైతులకు శాశ్వత నీటి భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా “తెలంగాణ జలసిరి” కార్యక్రమాన్ని అమలు చేస్తోందని ఎంపీడీవో హరినందన్ రావు తెలిపారు. “ప్రతి నీటి బొట్టు -- భవిష్యత్తుకు బలం” అనే నినాదంతో ఈ కార్యక్రమం కింద వర్షపు నీటిని ఒడిసిపట్టే పలు నీటి సంరక్షణ నిర్మాణాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు (మ్యాజిక్ సోక్ పిట్స్), ఫార్మ్ పాండ్స్, ఊట కుంటలు (పెర్కొలేషన్ ట్యాంకులు), బోర్ రీచార్జ్ నిర్మాణాలు, వ్యవసాయ బావుల తవ్వకం వంటి పనులను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటి ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలమట్టం పెరగడంతో పాటు రైతులకు సాగునీటి కొరత గణనీయంగా తగ్గే అవకాశం ఉందని వివరించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వివిధ పరిమాణాల్లో ఫార్మ్ పాండ్స్, రీచార్జ్ పిట్స్, పెర్కొలేషన్ ట్యాంకులు నిర్మించడంతో పాటు బోర్‌వెల్ రీచార్జ్ వ్యవస్థలను కూడా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ చర్యల ద్వారా భూగర్భ జలాల పునరుద్ధరణతో పాటు వ్యవసాయానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులు రైతులు, ప్రజలకు “నీటిని ఆదా చేయండి



-- భవిష్యత్తును కాపాడండి” అనే సందేశాన్ని అందిస్తూ, వర్షపు నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ రఘువీర్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో అనువైన స్థలాలను గుర్తించి సోక్ పిట్స్ తదితర నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందన్నారు. ప్రజలు స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ల సలహాలు, సహకారం తీసుకుని నిర్మాణాల విధివిధానాలపై పూర్తి అవగాహన పొందాలని, ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరిసర గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని కోరుతున్నారు.

### ఎస్ఐఆర్ పై సమీక్ష

# గడువులోగా ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశం

**పటాన్‌చెరు(ప్రజాజ్యోతి)** పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై జిల్లా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) సమీక్ష నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో సహాయ ఓటరు నమోదు అధికారులు (ఏఈఆర్‌వోలు), బీఎల్‌వో సూపర్వైజర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులతో కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్‌డీ (ఇంటింటి) పరిశీలన, రేషనలైజేషన్, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి దశలో నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తూనే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పనిచేయాలని తెలిపారు. ఓటర్ల వివరాల సేకరణ, ధ్రువీకరణ,



డిజిటలైజేషన్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని తహశీల్దార్ లు, డిప్యూటీ కమిషనర్ లు, మున్సిపల్ కమిషనర్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు, బీఎల్‌వో సూపర్వైజర్ లు, పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రిని సస్పెండ్ చేయాలి.

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లారెడ్డి.**

**కొండాపూర్ ప్రజా జ్యోతి** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను సస్పెండ్ చేయాలని కొండాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతియు తంగా నిరసన చేస్తున్న విద్యార్థి, నిరుద్యోగ యువతపై లాఠీచార్జిని వ్యతిరేకిస్తూ బుధవారం మాట్లాడుతూ ఢిల్లీలో శాంతియుతంగా విద్యార్థులు నిరుద్యోగులు నిరసన కార్యక్రమం చేస్తుంటే ఆర్ఎస్ఎస్, బీజేపీ, పోలీస్లు వారిపై లాఠీచార్జ్ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. డిగ్రీలు, పీజీలు చదివినా పట్టాలు వస్తున్నాయే తప్పా, పేపర్ల లీకేజీలతో విద్యా ర్థులు ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని అందుకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశా రు. నీట్ పేపర్ లీకేజీ పై బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి యాక్షన్ తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. విద్యార్థి, నిరుద్యోగులపై కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి వహిస్తోం దన్నారు. బీజేపీ ప్రభుత్వ అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నమ్మించి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా ఇప్పటికీ 12 కోట్ల ఉద్యోగాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి నిరుద్యోగులకు విద్యార్థులకు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## 24 గంటల్లో చోరీ కేసు ఛేదించిన పోలీసులు




**రాయికోడ్ జూలై 22 (ప్రజా జ్యోతి):** స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగాపూర్ గ్రామంలో జరిగిన చోరీ కేసును పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌హెచ్‌వో చైతన్య కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగాపూర్ గ్రామానికి చెందిన కాలిమొల్ల నాగేష్ ఇంట్లో జూలై 18న గుర్తుతెలియని వ్యక్తి తాళం పగులగొట్టి సుమారు 20 తులాల వెండి పట్టీలు,శాంసంగ్ మొబైల్ ఫోన్‌ను అపహరించాడు.మొత్తం చోరీకి గురైన ఆస్తి విలువ రూ.36 వేలుగా గుర్తించారు. ఈ ఘటనపై జూలై 21న పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం. 87/2026గా బీఎన్ఎస్ సెక్షన్లు 331(3),303(2) కింద కేసు నమోదు చేశారు. వెంటనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలు,శాస్త్రీయ సాక్ష్యాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సంగాపూర్ గ్రామానికి చెందిన మడిగడ్డ బసవరాజ్‌ను నిందితుడిగా గుర్తించి 24 గంటల్లోనే అరెస్ట్ చేశారు. నంతరం నిందితుడిని గౌరవ న్యాయస్థానంలో హాజరుపరచగా,కోర్టు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌హెచ్‌వో చైతన్య కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి నేరాల నియంత్రణలో సహకరించాలని రాయికోడ్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## టీజీ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ

**విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి.**

**తాసిల్దార్ అశోక్.**



**కొండాపూర్ ప్రజా జ్యోతి** కొండాపూర్ మండల కేంద్రంలోని టీజీ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మండల రెవెన్యూ అధికారి అశోక్, ఎంపీడీఓ సౌమ్య శ్రీ కలిసి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు వసతి గృహంలోని వివిధ విభాగాలను పరిశీలించిన అధికారులు విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. హాస్టల్ ఆవరణ పరిశుభ్రంగా ఉండటంతో పాటు భవనం లోపలి పరిసరాలు కూడా మంచి స్థితిలో ఉన్నాయని గుర్తించారు. వంటశాలను పరిశీలించగా తాజా కూరగాయలతో వంటలు సిద్ధం చేస్తున్నట్లు గుర్తించారు. విద్యార్థులకు అందిస్తున్న బియ్యం నాణ్యమైనదిగా ఉందని అధికారులు తెలిపారు. అలాగే భోజనశాల, స్నానాల గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా నిర్వహిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## తెలంగాణ రాష్ట్ర డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్,
# కొనింటి మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్



**సంగారెడ్డి (ప్రజా జ్యోతి)** హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ , జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు , ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ తెలంగాణ రాష్ట్ర డీజీపీ జ.ఎ ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పట్టణంలో పెరుగుతున్న జనాభా, పారిశ్రామిక విస్తరణ, ట్రాఫిక్ సమస్యలపై ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. జహీరాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తక్షణమే అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. జహీరాబాద్ పట్టణ జనాభా లక్షకు పైగా చేరుకోవడం, ఇటీవల ఐదు గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావడం, పట్టణ పరిసర ప్రాంతాల్లో అనేక చిన్న, పెద్ద పరిశ్రమలు ఏర్పడటంతో వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు ఇక్కడ నివసిస్తూ ఉపాధి పొందుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, వేగవంతమైన పోలీసింగ్ అందించాలంటే పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడం అత్యవసరమని పేర్కొన్నారు. అలాగే పారిశ్రామిక ప్రాంతాల్లో భద్రత, మహిళల రక్షణ, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కూడా డీజీపీని కోరారు. ఈ అంశాలపై తెలంగాణ రాష్ట్ర డీజీపీ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకునే దిశగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తెలిపారు.

# ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రం కుట్ర

**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

దేశంలో ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టి, ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర కుట్రలు చేస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల తరపున నిలబడి కేంద్రాన్ని నిలదీస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజాదరణను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందులో భాగంగానే ఆయనతో పాటు ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేయిస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ తో పాటు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన 'చలో లోక్ భవన్' నిరసన కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరమ్మ విగ్రహం వద్దకు వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు యువతతో కలిసి ఆయన రాజ్ భవన్ వైపు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు కష్టపడి చదివిన లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం దారుణంగా చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా నీట్ పేపర్ లీకేజీ కుంభకోణంతో విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. ఈ దారుణమైన వైఫల్యానికి బాధ్యత




వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కక్షసాధింపు చర్యలతో ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపినంత మాత్రాన కాంగ్రెస్ పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు. విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో దేశ ప్రజలు, యువత తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వీర్లపల్లి శంకర్, అంబర్ పేట్ ఇంచార్జీ డాక్టర్ సి రోహిన్ రెడ్డి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ , ఎన్ఎస్ యుఐ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు భారీగా పాల్గొన్నారు..

## జహీరాబాద్‌కు నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మంజూరు చేయాలని

### రాష్ట్ర డీజీపీకి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు



**జహీరాబాద్, జూలై 22 (ప్రజా జ్యోతి న్యూస్)** హైదరాబాద్‌లోని రాష్ట్ర డీజీపీ కార్యాలయం లో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ని జహీరాబాద్ శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు, సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న పట్టణ పరిధి, పరిశ్రమల అభివృద్ధి, విద్యాసంస్థలు, ప్రజా రవాణా వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చిందని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా, జహీరాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. జహీరాబాద్ ప్రజల భద్రత, ట్రాఫిక్,నియంత్రణ శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ ప్రతిపాద నను సానుకూలంగా పరిశీలించి, త్వరిత గతిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు రాష్ట్ర డీజీపీ ని విజ్ఞప్తి చేశారు.

## లోక్ సభా ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ అక్రమ అరెస్టు అప్రజాస్వామికం

**జహీరాబాద్, జూలై 22(ప్రజా జ్యోతి న్యూస్)**

పట్టణం మునిసిపల్ కార్యాలయంలోని గాంధీ గారి విగ్రహం వద్ద శాంతియుత నిరసన తెలిపి, అక్కడి నుండి ర్యాలీ గా బయలుదేరి అంబెద్కర్ గారి విగ్రహం ముందు రోడ్డు పై బైఠాయించి, ఢిల్లీలో కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, వారికి మద్దతుగా జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ మంత్రివర్యులు డా॥ఏ. చంద్రశేఖర్ శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు డా॥ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ,ప్రజాస్వామ్య గొంతుకను అణిచివేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తోంది, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకున్న నీట్ (బీజుజు) పేపర్ లీకేజ్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోవడానికి, విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగు తూనే ఉంటుంది ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తం చేసే హక్కును గౌరవించాలని, ప్రజల గొంతును అణచివేసే చర్యలు ప్రజా స్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మునిసిపల్ చైర్మెన్ మహమ్మద్ యూనుస్ గారు,ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి గారు,పట్టణ అధ్యక్షులు నరేష్ గౌడ్, మండల అధ్యక్షులు హుగ్గేల్లి రాములు, భాస్కర్ రెడ్డి, పవన్ రాథోడ్ మాజీ పట్టణ అధ్యక్షులు కండెం.నర్సింలు మాజీ మండల అధ్యక్షులు మాక్సూద్ అహ్మద్ అసెంబ్లీ కో–ఆర్డినేటర్ గౌస్, కౌన్సిలర్ అశోక్–కవిత, నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, మాజీ వైస్ చైర్మన్ ఖాజా, మాజీ వైస్ ఎంపీపీ.రాములు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఖాజీపల్లి లో అక్రమ నిర్మాణాల కూల్చివేత లు

**జిన్నారం(ప్రజాజ్యోతి)**





గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ఖాజీపల్లి గ్రామ శివారులో రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 181లో అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలను జిన్నారం తహశీల్దార్ ఆంథోని ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది జేసీబీ సహాయంతో కూల్చివేశారు ఈ సందర్భంగా తహశీల్దార్ ఆంథోని మాట్లాడుతూ, ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని, భవిష్యత్తులో ఇలాంటి ఆక్రమణలు గుర్తించిన వెంటనే కూల్చివేతతో పాటు సంబంధిత వ్యక్తులపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు రెవెన్యూ శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని, స్థానిక ప్రజలు కూడా ప్రభుత్వ భూములపై జరిగే అక్రమ ఆక్రమణల సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని ఆయన కోరారు.

# జహీరాబాద్ మున్సిపాలిటీ ఏరియాలో వర్షం కురిస్తే చాలు ప్రజల ప్రాణాలు అరచేతిలోనే





డ్రైనేజ్ నీరు రోడ్డుపైనే మురికి నీరు రోడ్డు పైనే వర్షంనీరు రోడ్డుపైనై మరి మోరీలు ఎక్కడ

37వ వార్డు కౌన్సిలర్ పెద్దబయి మైపాల్,

టీవైజే ఎఫ్ నియోజకవర్గ జనరల్ సెక్రటరీ మొహమ్మద్ ఇమ్రాన్

**జహీరాబాద్, జూలై 22 (ప్రజా జ్యోతి న్యూస్)** ప్రధాన రహదారులపై గుంతలు అరగజం పాటులోతుకు ఉన్నప్పటికీ రోడ్డుపైన వర్షం నీరు చేరుకోవడంతో గుంతలు ఎక్కడున్నా యో ఎర్రటి నీటిలో తెలవక టూవీలర్ ప్రయాణదారుల ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. ప్రధానంగా జహీరాబాద్ నుండి తాండూర్ వెళ్లే రహదారి ప్రధానంగా మనం చూసుకుంటే బాగా రెడ్డి ఫ్లైఓవర్ నుండి రాంనగర్ మరియు మల్చల్మ గ్రామం వరకు రోడ్డు మొత్తం పాడైనప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా కనీసం మరమ్మత్తులు చేయాలన్న ఆలోచనలు లేరు డాంబర్ రోడ్ మొత్తం గుంతలతో పాడైన ఇస్తే ఆగుంతలలో సేడే మన్నును తెచ్చి నింపుతున్నారు. ఆ సేయడం అన్న కాస్త నీటిలో నాని బురదగా మారడమే కాకుండా ప్రయాణించే ప్రయాణి కుల వాహన టైర్లకు గ్రిప్ ఇవ్వకుండా బండ్లు జారీ ప్రజలు బొక్క బోర్లా పడుతున్నారు ఇంత జరుగుతున్న అధికారులు గానీ నియోజకవర్గ ఎమ్మెల్యే గాని పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్ గాని మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ కమిషనర్ గాని రోడ్డు నిర్మాణ శాఖ అధికారులు గానీ చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. చెప్పుకోవ డానికే వంద ఫీట్ల రోడ్డు రెండు వైపులా కాల్వల నిర్మాణం లేక ఫ్లై ఓవర్ పక్కన ఉన్న ఉష్కా అడ్డ దగ్గర రోడ్డు ఎంత దంసంగా అయిందో మీకు అందరికీ తెలుసు వందల టన్నుల కొద్ది లారీల బరువుకు రోడ్డు మొత్తము పెద్ద పెద్ద గుంతలుగా మారింది ఉష్కా అడ్డ దగ్గర నుండి రాంనగర్ వరకు పుష్కు లారీలు రోడ్డు పైనే కంకర్ షాపులు రోడ్డుపైనే హార్డ్వేర్ షాపులు రోడ్డుపైనే 100 ఫీట్ల రోడ్డు చెప్పడానికి మాత్రమే 20 ఫీట్ల రోడ్డుకు మాత్రం పరిమితం చేసిన షాపు ఓనర్లు వారిపై చర్యలు ఎప్పుడు తీసు కుంటారో సమాధానం చెప్పాలి రెండు వైపులా కాల్వల నిర్మించి 100ఫీట్ల రోడ్డును పూర్తిగా ప్రజలకు అందుబాటులో తేవాలని మొహమ్మద్ ఇమ్రాన్ టీవైజే ఎఫ్ నియోజక వర్గ జహీరాబాద్ డిమాండ్ చేస్తున్నారు.

# హోతి-కే గ్రామంలో తాగునీటి సమస్యకు చెక్

నూతన బోరు మోటర్ ను ప్రారంభించిన

మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ - కమిషనర్ ప్రభాకర్



**జహీరాబాద్ జూలై 22( ప్రజా జ్యోతి న్యూస్ )** జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు హోతి-కే గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా నూతన బోరు మోటర్ ను మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ ప్రారంభించారు. దీంతో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ మున్సిపల్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను ఉద్దేశించి మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ మాట్లాడుతూ, ప్రజలకు తాగునీరు అందించడం మా మొదటి బాధ్యత ప్రతి ఇంటికి అవసరమైన మౌలిక సదుపా యాలు చేరేలా మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తుంది. ఏ వార్డులోనైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరిస్తాం. ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాం. అభివృద్ధి పనుల్లో ఎలాంటి రాజీ ఉండదు. ప్రజల సహకారంతో జహీరాబాద్ ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా ప్రజలు మున్సిపాలిటీ అందిస్తున్న సౌకర్యా లను సద్వినియోగం చేసుకోవడంతో పాటు నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించాలి. తాగునీటి వనరులను పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ మాట్లాడుతూ, పట్టణం లోని అన్ని వార్డుల్లో తాగునీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. అవసర మైన చోట బోరు మోటార్లు ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు పై వెంటనే స్పందించి పరిష్కారం చూపిస్తాం అని తెలిపారు. హోతి -కే వార్డు ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్, కమిషనర్ ప్రభాకర్ కు ప్రత్యేకంగా ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వకీల్ చౌహాన్, సంగన్న, మైపాల్, శీను, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజాప్రతి నిధులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోహిర్ మండల, పట్టణ బిఎల్ఎ'ఎస్‌తో (ఎస్ఐఆర్) సమీక్ష సమావేశం

మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్



**జహీరాబాద్, జూలై 22(ప్రజా జ్యోతి న్యూస్)** కోహిర్ పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాల్ లో కోహిర్ మండల మరియు పట్టణ బూత్ లెవెల్ ఏజెంట్ల ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమీక్షా సమావేశం మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, ఓటరు నమోదు ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారంల భర్తీ, ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రతి అర్హులైన ఓటర్లను నమోదు చేయడం వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా డా॥ఏ.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రతి అర్హులైన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవడం ప్రజా స్వామ్యాన్ని బలోపేతం చేసే బాధ్యత. ప్రతి ఇంటికి చేరుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని పార్టీ నాయకులు, కోఆర్డినేటర్లు, బీఎల్ఏలు, కార్యకర్తలకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయం అందిస్తూ, ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో జహీరాబాద్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, అసెంబ్లీ కో-ఆర్డినేటర్ మహమ్మద్ గౌస్, కోహిర్ మునిసిపల్ ఛైర్మన్ అశోక్ కుమార్, కోహిర్ మండల అధ్యక్షులు సువర్ణ-మల్లన్న పాటిల్, పట్టణ అధ్యక్షులు ముజాఫ్ఫర్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అర్షద్ అలీ, మాజీ పట్టణ అధ్యక్షులు శంషీర్ అలీ, నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, మునిసిపల్ వైస్ చైర్మన్ హన్నన్ జావీద్, కౌన్సిలర్లు సర్పంచులు, బిఎల్ ఎ లు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## సంగారెడ్డిలో 18వ ఈషా గ్రామోత్సవం

-- ఈనెల 25న రూరల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం



**సంగారెడ్డి (ప్రజా జ్యోతి):** సంగారెడ్డి అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 25వ తేదీన ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 4వ ఈషా గ్రామోత్సవం రూరల్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీ యువకులు, మహిళలు పాల్గొనే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. పురుషుల కోసం వాలీబాల్, మహిళల కోసం త్రోబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ యువత తమ ప్రతిభను చాటుకునేందుకు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు ఈ గ్రామోత్సవం మంచి వేదికగా నిలుస్తుందని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. క్రీడలపై ఆసక్తి ఉన్న గ్రామీణ ప్రాంతాల యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి

**పీసీఆర్, పీఓఏ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలి –**
**– జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి జూలై 22:–** పీసీఆర్, పీఓఏ చట్టాలను జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలు చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం, పీసీఆర్, పీఓఏ చట్టాల అమలుపై సమీక్షా సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో చోటుచేసుకునే ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, అట్రాసిటీ ఘటనలను అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులోకి రాని వాస్తవ ఘటనలను రెవెన్యూ, పోలీసు అధికారులు గుర్తించి, వాస్తవమైన ప్రతి కేసును నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. బాధితులకు చట్టప్రకారం అందాల్సిన రక్షణ, సహాయం, ఆర్థిక ఉపశమనం, న్యాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆర్డీవోలకు ఆదేశించారు. 2022 నుండి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 144 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ఆర్థిక ఉపశమనం కింద సుమారు రూ.2.58 కోట్ల నిధులు అవసరమవగా, ఇప్పటివరకు రూ.1.74 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 37 మంది బాధితులకు రూ. 68,87,500/– విడుదల చేసినట్లు, మిగిలిన అర్హులైన బాధితులకు ఆర్థిక ఉపశమనం అందజేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు వివరించారు. సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై జిల్లా కలెక్టర్ డీఎస్పీలను కేసుల వారీగా వివరాలు అడిగి తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని సూచించారు. దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని, గ్రామ, మండల స్థాయి కమిటీల ద్వారా అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, 2026 జూన్ నెలాఖరు వరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద 31 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అందులో 12 కేసులు దర్యాప్తు దశలో ఉండగా, 19 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రతి కేసులో బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తూ, చట్టప్రకారం సత్వర న్యాయం అందేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ, ఏసీపీలు, డీఎస్పీలు, రెవెన్యూ డివిజనల్ అధికారులు రాజేందర్, దేవుజ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.




## 24 గంటల్లో చోరీ కేసు ఛేదన..
## నిందితుడి అరెస్ట్..

రాయికోడ్ పోలీసులను అభినందించిన జిల్లా ఎస్పీ

సంగాపూర్‌లో చోరీ ఘటన

రాయికోడ్ జూలై 22 (ప్రజా జ్యోతి): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంగాపూర్ గ్రామంలో జరిగిన చోరీ కేసును రాయికోడ్ పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.కేసును వేగంగా ఛేదించిన రాయికోడ్ ఎస్ఐ చైతన్య కిరణ్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ అభినందించారు.

**ఫిర్యాదు.. కేసు నమోదు**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగాపూర్ గ్రామానికి చెందిన కాలిమొల్ల నాగేష్ (తండ్రి సంగయ్య) ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నెం.87/2026గా బీఎన్ఎస్ సెక్షన్లు 331(3), 303(2) కింద కేసు నమోదు చేశారు. ఈ నెల 18న గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి సుమారు 20 తులాల వెండి పట్టీలు (విలువ రూ.11 వేల)తో పాటు రూ.25 వేల విలువైన శాంసంగ్ మొబైల్ ఫోన్‌ను అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం చోరీకి గురైన ఆస్తి విలువ రూ.36 వేలుగా పోలీసులు తెలిపారు.

**ప్రత్యేక బృందంతో దర్యాప్తు**

కేసు నమోదు చేసిన అనంతరం రాయికోడ్ ఎస్ఐ చైతన్య కిరణ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక సమాచారంతో



పాటు సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాక్ష్యాధారాలను సేకరించి వేగంగా విచారణ చేపట్టారు.

**24 గంటల్లోనే నిందితుడి అరెస్ట్**

దర్యాప్తులో సంగాపూర్ గ్రామానికి చెందిన మడిగడ్డ బసవరాజ్ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు.అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా,కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

**పోలీసు బృందాన్ని అభినందించిన ఎస్పీ**

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. ప్రజల ఆస్తుల భద్రతకు సంగారెడ్డి జిల్లా పోలీసులు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. కేవలం 24 గంటల్లోనే కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసిన రాయికోడ్ ఎస్ఐ చైతన్య కిరణ్, దర్యాప్తు బృందం, పోలీసు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

**ప్రజలకు ఎస్పీ సూచనలు**

ప్రజలు ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొన్నారు.

## కోహిర్ మండల స్థాయి 3 రోజుల ప్రాథమిక ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమం

ట్రైనింగ్ కోర్స్ డైరెక్టర్ ఎంఈఓ జాకీర్ హుస్సేన్



**జహీరాబాద్, జూలై 22 (ప్రజా జ్యోతి న్యూస్)** నియోజకవర్గ కోహిర్ మండల స్థాయి 3 రోజుల ప్రాథమిక ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమం జడ్.పి.హెచ్.ఎస్ బాలికల కోహిర్ నందు విజయ వంతంగా ముగిసింది. ట్రైనింగ్ కోర్స్ డైరెక్టర్ ఎంఈఓ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ... 3 రోజులపాటు ప్రాథమిక ఉపాధ్యాయులకు తెలుగు, గణితం, ఇంగ్లీష్ లతో పాటు ఉపాధ్యాయ వృత్తి పరమైన జనరల్ విషయాలపై ఆర్పిలు రాజ్ కుమార్, ఇబ్రహీం, సింహాచలం మరియు గోవింద్ రావు శిక్షణను ఇచ్చారు. ఎంఈఓ మాట్లాడుతూ... ప్రతి ఉపాధ్యాయుడికి వృత్యంతర శిక్షణ తప్పని సరి అని, సమాజం లోని నూతన పోకడలను పరిశీలిస్తూ, నిరంతరం కొత్త విషయాలు నేర్చుకొని తమ వృత్తిపరమైన అభివృద్ధి పొంది, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. 3 రోజుల పాటు జరిగిన శిక్షణలో ఉపాధ్యాయులు చాలా ఉత్సాహం గా పాల్గొని, ట్రైనింగ్ లో నూతన విషయాలను తెలుసుకున్నారు.

## రోడ్డుకు ఇరువైపోల ఉన్న పాదల తొలగింపు -- గుంతల పూడ్చివేత. సర్పంచ్ గోవింద్ నాయక్



**కల్హే ర్ , జూలై 22:** ప్రజా జ్యోతి సంగారెడ్డి జిల్లా లోని కల్హే ర్ మండలం పరిధిలోని బీబీపేట్. పోచపూర్ గ్రామ ప్రజలు, వాహనదారుల సౌకర్యార్థం పోచాపూర్ చౌరస్తా నుంచి జేమ్లా తండా వరకు ఉన్న ప్రధాన రహదారిపై ప్రత్యేక మరమ్మతు పనులు చేపట్టారు. రహదారి ఇరువైపులా పెరిగిన పొదలు, చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు, రోడ్డుపై ఏర్పడిన ప్రమాదకర గుంతలను ట్రాక్టర్ సహాయంతో పూడ్చివేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోవింద్ నాయక్ మాట్లాడుతూ, వాహనదారులు, బాటసారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

# ఖేడ్ తాలూకా టీఎన్‌జీఓస్ యూనియన్ అధ్యక్షుడిగా ఎం.డి. మిస్కిన్





నారాయణఖేడ్, జూలై 22: నారాయణఖేడ్ తాలూకా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టీఎన్‌జీఓస్) నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్ తెలిపారు.

బుధవారం నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన టీఎన్‌జీఓస్ తాలూకా స్థాయి ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణఖేడ్ తాలూకా అధ్యక్షులుగా ఎం.డి. మిస్కిన్, ప్రధాన కార్యదర్శిగా పి. దత్తు, అసోసియేట్ కార్యదర్శిగా కె. రవిందర్, కోశాధికారిగా భాస్కర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సంతోష్ కుమార్, రజిత, సాయన్న, సంయుక్త కార్యదర్శులుగా అరుణ్, విట్టవ్వ, వ్యవస్థాపక కార్యదర్శిగా ముజమ్మిల్, ప్రచార కార్యదర్శిగా రుక్మారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా నాగలక్ష్మి, లక్ష్మణ్ కుమార్, పండరీ, సూర్యకాంత్, ప్రవీణ్, రాజు నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఎం.డి. జావిద్ అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి వి. రవి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాస్ హాజరై నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ తాలూకా అధ్యక్షులు ఎం.డి. మిస్కిన్ మాట్లాడుతూ.. ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సేవా సమస్యల పరిష్కారం కోసం సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. యూనియన్ బలోపేతానికి ప్రతి ఉద్యోగిని కలుపుకొని ముందుకు సాగుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

## రెడ్కో డీఈ నివాసంలో ఏసీబీ సోదాలు

**హైదరాబాద్ :** తెలంగాణ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఒఉఖీఇఆఅా) డీఈ ముత్యం వెంకటరమణ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మాదాపూర్లోని ఆయన ఇంటితో పాటు మొత్తం 10కి పైగా ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు కొనసాగుతున్నాయి. డీఎస్పీ మాజి ఖాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సోదాలు ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించినవిగా సమాచారం.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మార్కాపురం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం..

## కారులో ఇరుక్కున్న వ్యక్తి

మార్కాపురం మండలం తిప్పాపాలెం ? చింతకుంట్ల గ్రామాల మధ్య ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న బొలెరో కారు ప్రమాదానికి గురికావడంతో అందులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి కారులో ఇరుక్కుపోయాడు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది తీవ్రంగా శ్రమించి కారులో చిక్కుకున్న వ్యక్తిని సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం అతడిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.ప్రమాదానికి గల కారణాలు, గాయపడిన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మద్యం మత్తులో తల్లితో గొడవ

## తల్లి చేతిలో దారుణ హత్య

అవనిగడ్డలో మంగళవారం రాత్రి దారుణం చోటుచేసుకుంది. చల్లపల్లి పడమర వీధిలో మద్యం మత్తులో ఉన్న కొడుకు మోతుకూరి దుర్గాప్రసాద్ (35) తన తల్లి నాగమణిపై దాడికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో తల్లి నాగమణి ఎదురు తిరిగి కొడుకుని కొట్టడంతో అతను మృతి చెందాడు. అనంతరం తల్లి నాగమణి పరారైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

## వరుస తప్పులతో ఉదయ్ కృష్ణారెడ్డి

**ఒంగోలు, హైదరాబాద్ :** ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్ కాంపిటీటర్లకు ఆదర్శంగా నిలిచి, శ్రమించి సాధించిన విజయాన్ని ఒక క్రమశిక్షణతో ముందుకు తీసుకెళ్లాల్సిన ఒక ఐపీఎస్ ట్రైనీ అధికారి.. వ్యక్తిగత ప్రవర్తనా లోపాలు, విలువలేని నిర్ణయాలతో తన చేజేతులా కెరీర్‌ను నాశనం చేసుకున్న ఆశ్చర్యపరుస్తోంది. ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారంలో వెలుగు చూసిన వరుస పరిణామాలు, సహ-ట్రైనీతో వివాదం , ఆ తర్వాత చోటుచేసుకున్న డ్రామాలు ఆయన తీవ్రమైన నైతిక పతనానికి నిదర్శనంగా నిలిచాయి. ఉన్నతమైన స్థానానికి చేరుకున్న తొలి మెట్టులోనే నైతికంగా దృఢంగా నిలబడాల్సింది పోయి, ప్రవర్తనా నియమావళిని విస్మరించడం వల్లనే ఈ పరిణామాలు పీకల మీదకు వచ్చాయి.తోటి వివాహిత ట్రైనీ ఐపీఎస్ అధికారితో ఉన్న వ్యక్తిగత సంబంధం బెడిసికొట్టడం, దానిపై పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కేంతగా విభేదాలు రావడం ఒక ఎత్తయితే.. ఆ తర్వాత ఆయన ప్రదర్శించిన వైఖరి మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత విషయాలను బహిర్గతం చేయడం, లీగల్ నోటీసులకు విరుద్ధంగా వ్యవహరించడం , సింపతీ పొందడానికి ఆత్మహత్యాయత్నం నాటకాలు ఆడటం వంటి చర్యలు సర్వీస్ నిబంధనలకు సంపూర్ణంగా విరుద్ధం. ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పరం మాట్లాడుకుని సర్దుబాటు చేసుకోవాల్సిన లేదా చట్టబద్ధంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యను రోడ్డున పడేసి, రచ్చ చేసుకోవడం ద్వారా ఉదయ్ కృష్ణారెడ్డి తన ప్రొఫెషనలిజాన్ని గాలికి వదిలేశారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.భారత సివిల్ సర్వీసెస్‌లో పనిచేసే అధికారులకు నైతికత , ఆత్మనిగ్రహం, భావోద్వేగ నియంత్రణ అత్యంత కీలకమైన అంశాలు. బాధ్యతాయుతమైన ఐపీఎస్ అధికారిగా దేశానికి సేవ చేయాల్సిన వ్యక్తి, ట్రైనింగ్ దశలోనే ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు, నైతిక లోపాలు ఎదుర్కొని కేంద్ర హోంశాఖ ద్వారా సస్పెన్షన్‌కు గురికావడం ఒక రకంగా వ్యవస్థాత్మక వైఫల్యాన్ని కూడా ఎత్తిచూపుతోంది. విజయం నెత్తికెక్కించుకోకుండా, తన లక్ష్యాన్ని, రాజ్యాంగ బద్ధమైన బాధ్యతలను నిరంతరం గుర్తు చేసుకుంటూ ముందుకు సాగాల్సిన ఉదయ్ కృష్ణారెడ్డి.. తప్పు మీద తప్పు చేస్తూ తన కెరీర్‌ను రిస్కులో పెట్టుకున్నారుఇప్పుడు ప్రభుత్వం, కేంద్ర హోంశాఖ తీసుకున్న కఠిన చర్యల వల్ల ఆయనకు తన తప్పులను దిద్దుకునే

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ )-2025లో 100% లక్ష్యాన్ని గడువుకు ముందే పూర్తి చేసిన కల్హేర్ మండలం

### తహసీల్దార్ కే. శివ శ్రీనివాస్ వెల్లడి



**కల్హేర్, జూలై 22 (ప్రజా జ్యోతి):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ )-2025 కార్యక్రమంలో భాగంగా కల్హేర్ మండలంలో చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. ఈ కార్యక్రమంలో 2002 నుంచి 2025 వరకు ఓటర్ల వివరాల అనుసంధానం, ప్రతి ఇంటికి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వాటి సేకరణ, అలాగే ఓటర్ల వివరాల ఖచ్చితమైన ధృవీకరణ వంటి కీలక పనులను మండల స్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఢ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఉమాహారతి, ఐఏఎస్ అందించిన మార్గదర్శకత్వం, సమర్థవంతమైన ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ కీలక పాత్ర పోషించాయని అధికారులు తెలిపారు. చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, తెలంగాణ, హైదరాబాద్ సూచనల మేరకు ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు చివరి తేదీ జూలై 10, 2026గా నిర్ణయించబడినప్పటికీ, కల్హేర్ మండలం ఆ గడువుకు ముందుగానే 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసిన రాష్ట్రంలోని తొలి మండలంగా నిలవడం విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న బీఎల్ఓలు, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో పాటు సహకరించిన ప్రజలకు తహసీల్దార్ కే. శివ శ్రీనివాస్ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## పోటీకి రెడీ అవుతున్న తోట

**గుంటూరు :** మాజీ ఐఎఎస్ అధికారి తోట చంద్రశేఖర్ తిరిగి యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆయన ఏ పార్టీలో చేరతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. తోట చంద్రఖేశఖర్ బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఇప్పుడు ఆ పార్టీలో దాదాపుగా లేరనే చెప్పాలి. తాజాగా తోట చంద్రశేఖర్ రెండు పార్టీల వైపు చూస్తున్నట్లు తెలిసింది. బీజేపీలో చేరడం, లేదా వైసీపీలో చేరడంపైనే ఆయన ఎక్కువగా ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. జనసేనలో చేరే అవకాశం లేకపోవడంతో ఇక ఈ రెండు పార్టీల్లో ఏదో ఒక దానిలో చేరి వచ్చే ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని చూస్తున్నారు. అయితే రెండు పార్టీల నుంచి ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేద చిరంజీవితో సమావేశం తర్వాత… కొంత కాలం క్రితం మెగాస్టార్ చిరంజీవితో తోట చంద్రశేఖర్ సమాశమయ్యారు. తోట చంద్రశేఖర్ జనసేనలో చేరబోతున్నారన్న ప్రచారం గత కొంత కాలంగా జరుగుతుంది. తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి నేపథ్యంలో ఆయన బీఆర్ఎస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరతారని జోరుగా ఊహాగానాలు వచ్చాయి. అందుకే చిరంజీవిని కలిశారని అనుకున్నారు. కానీ జనసేన నుంచి ఆయనకు సానుకూల స్పందన రాలేదని తెలిసింది. ఆయన సొంత మీడియాలో కూడా జనసేనకు వ్యతిరేకంగా వార్తలు వస్తున్న నేపథ్యంలో వైసీపీ లేదా బీజేపీలో చేరతారని తాజాగా ఆయన అనుచరులు చెబుతున్నారు…. తోట చంద్రశేఖర్ కాపు సామాజికవర్గం కావడంతో వైసీపీ కూడా ఆయన చేరిక పట్ల కొంత సానుకూలతగా ఉన్నట్లు తెలిసింది. గుంటూరు జిల్లాలోనే ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని తోట చంద్రశేఖర్ భావిస్తున్నారు. ఆ హామీ పార్టీ నాయకత్వం నుంచి లభిస్తే త్వరలోనే ఆయన చేరిక ఉంటుందని అంటున్నారు.